# మొదటి రోజు ప్రశాంతం

- కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పేపర్-1
- పెద్దగా కనిపించని పేపర్ లీకేజీ ప్రభావం
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



ఇబ్రహీంపట్నం: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు



ఆమనగల్లు: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మంచాల: పదవ తరగతి పరీక్షలు మంచాల మండల కేంద్రంలోని మూడు సెంటర్లలో సోమవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో 136 మందికి 136 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 160 మందికి 160 మంది, కేజీబీవీ పాఠశాలలో 190 మందికి 190 మంది హాజరయ్యారు.

**ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో..**

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సోమవారం పదోతరగతి మొదటి పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. పట్టణంలోని 2 పరీక్ష కేంద్రాల్లో 539 మంది విద్యార్థులకు గాను 538 మంది హాజరయ్యారు. మాడ్గుల మండలంలో ఎస్ఎస్‌సీ పరీక్షల కోసం మాడ్గుల మండల కేంద్రంలో రెండు, ఇర్విన్ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూడు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు 439 విద్యార్థులకు గాను 438 మంది విద్యార్థులు హాజరయ్యారైనట్లు అధికారులు తెలిపారు.

**హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో**

హయత్‌నగర్: సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో మొత్తం 6522 మందికి గాను 6503 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ హీర్యానాయక్ తెలిపారు. మొదటి రోజు పరీక్ష ఎలాంటి ఆటంకం లేకుండా జరిగిందని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని ఆయన పేర్కొన్నారు.

**తలకొండపల్లి మండలంలో..**

తలకొండపల్లి: మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రం, వెల్జాల్ పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని చీఫ్ సూపరింటెండెంట్‌లు జగదీశ్వర్, రామనాథం తెలిపారు. తలకొండపల్లి పరీక్షా కేంద్రంలో 182 మంది విద్యార్థులకు 182 మంది, అదే విధంగా వెల్జాల్‌లో 105 మందికి 105 మంది విద్యార్థులు పరీక్ష రాశారని వారు తెలిపారు.

**యాచారం మండలంలో..**

యాచారం: యాచారం మండలంలో పదో తరగతి పరీక్ష మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 936 మంది విద్యార్థులకు గాను 935 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

**కద్దాల్ మండలంలో..**

కద్దాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని ఏ, బీ సెంటర్‌లతో పాటు, ముద్విన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 471 మంది విద్యార్థులకు గాను 469 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పూర్తిగా తనిఖీ చేసిన అనంతరమే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి పంపించారు. ఏఎస్ఐ ప్రసాద్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

**ఇబ్రహీంపట్నం మండల పరిధిలో..**

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పదోతరగతి పరీక్షలకు మొదటి రోజు సోమవారం 1999 మంది విద్యార్థులకు గాను 1992 మంది విద్యార్థులు హాజరయ్యారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, గురుకుల విద్యాపీఠ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు), శాస్త్రా, టీఆర్ఎస్, ప్రియాంక, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



కద్దాల్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కద్దాల్: పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



ఆమనగల్లు: పరీక్ష కేంద్రం బయట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



యాచారం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఆమనగల్లు: పరీక్షా కేంద్రం వద్ద అత్యవసర సేవల కోసం ఆశ కార్యకర్తలు



ఇబ్రహీంపట్నం: పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

## క్లుప్తంగా

### దివ్యాంగుడి కృషి అభినందనీయం: ఎంపీపీ




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య, సీఐ లింగయ్య

యాచారం: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గాను దివ్యాంగుడైన బొడ్డు శేఖర్ యాచారం మండల కేంద్రంలో చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో దివ్యాంగుడు బొడ్డు శేఖర్ అతని స్నేహితులు మేదరి వెంకటేష్, శివలింగం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ చలివేంద్రాన్ని సోమవారం ఎంపీపీ కొప్పు సుకన్య ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం యాచారం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం బొడ్డు శేఖర్ సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సీఐ లింగయ్య, యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### మాసబ్ చెరువులో మట్టిని తొలగించండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి సర్వే నంబర్ 205లోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో డంప్ చేసిన మట్టిని తొలగించే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్ గౌడ్ అన్నారు. సోమవారం మట్టిని తొలగించడానికి మున్సిపాలిటీ నుంచి రూ.5 లక్షలను కేటాయించామని.. అధికారులు సహకరించి మట్టిని తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, ఇరిగేషన్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నారని కవిత, కంబాలపల్లి ధన్‌రాజ్, కాకుమాను సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్‌యూఐ గ్రామ అధ్యక్షుడిగా పవన్‌కల్యాణ్



నియామకపత్రం అందుకుంటున్న పవన్ కల్యాణ్

కద్దాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కావలి పవన్ కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పవన్‌కల్యాణ్‌తో పాటు కార్యవర్గాన్ని నియమించారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజేశ్, కద్దాల్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు శ్రీకాంత్, దర్శన్, మహేందర్, మోహన్, పవన్ ఉన్నారు.

### మాలలపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ నేత శేఖర్‌గౌడ్ దిష్టిబొమ్మ దహనం



శేఖర్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మాల కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా సోమవారం ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ దిష్టిబొమ్మను ఆ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు దహనం చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ సమావేశంలో.. మాల కులాన్ని అవమానపరిచేవిధంగా ఈసీ శేఖర్‌గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని.. ఆ సమావేశంలో ఉండి శేఖర్‌గౌడ్‌ను వారించకుండా నవ్వుతున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మాలల జోలికి వస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని, రాజకీయంగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భర్తకి జగన్, తులేకలాన్ సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ నాగమణి, అంబేడ్కర్ సంఘ నాయకులు బుగ్గ రాములు, యాదగిరి, నర్సింగరావు, రవి, శివకుమార్, యాదగిరి, సురేందర్, బార్గవ్, మహేశ్, రాజ్‌కుమార్, దళితసంఘాల నేతలు పాల్గొన్నారు.

### ఘనంగా సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

కద్దాల్: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు సోమవారం భక్తజన సందోహం మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శివాచార్య మహాస్వామి శిష్యబృందంతో పాటు అంగడిమఠం భువనేశ్వర్ బృందం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ దాత పి.బస్వరాజ్–రాజమణి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, సంతోష్, మల్లేశ్, యాదయ్య, రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

### ఎండుతెగులుతో జాగ్రత్త: ఏఓ

ఆమనగల్లు: పంటలలో ఎండుతెగులు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండలంలోని పోలెపల్లి, విఠాయిపల్లి గ్రామాలలో రైతులు సాగుచేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. సమస్యాత్మక భూముల్లో సాగుచేసిన వరిపైరుకు జీలుగ, పచ్చిరొట్ట వేయాలని సూచించారు. పంటల్లో ఆకుమచ్చ, ఎండుతెగులు నివారణకు హెక్సాకొనాజోల్ ద్రావకాన్ని 2 మి.లీలు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓ శివతేజ, రైతులు బుచ్చయ్య, జంగయ్య, పెద్దమల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### చిరుధాన్యాలతో అధిక పోషకాలు

ఆమనగల్లు: చిరుధాన్యాలు తీసుకోవడం వలన అధిక పోషకాలు లభిస్తాయని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో... బేటీ పఢావో కార్యక్రమం, పోషక ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు, ఉపసర్పంచ్ మిద్దె రాములు, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి రేఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, బాలమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, రాణి, యాదమ్మ, ఏఎన్ఎం సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆస్తిపన్నుపై 5శాతం రాయితీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు ఈనెల 30వ తేదీలోపు తమ ఆస్తి పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీని ఇవ్వనున్నట్లు కమిషనర్ సత్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిన నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళం అందించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిన కమ్యూనిటీ హాల్‌ను ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభ్యర్థించగా రూ.3 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలో సోమవారం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులకు ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డిని నేతలు సన్మానించారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పెరికేటి యాదయ్య, శేఖర్, నగేశ్, రామచంద్రయ్య, రవి, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న రంగారెడ్డి

హయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలో అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర సందర్భంగా ఆదివారం రాత్రి పస్మాములలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించామని, ఇళ్ల స్థలాలను ఇచ్చామని తెలిపారు. ఇందిరా గాంధీ దళితులకు, పేదలకు సాగు భూమిని పంచిపెడితే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని లాక్కుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని ఆరోపించారు. పసుమాముల చెరువులోకి డ్రైనేజీ నీరు వస్తుండటంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డంపింగ్ యార్డును కూడా ఈ గ్రామంలోనే ఏర్పాటు చేయడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మంగమ్మ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చిట్టిరాజుగౌడ్, కౌన్సిలర్లు రాజేందర్, గీత, జయశ్రీ, నాయకులు కొండల్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్యకు నివాళి




ఇబ్రహీంపట్నం: కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇబ్రహీంపట్నంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొమురయ్య విగ్రహ కమిటీ అధ్యక్షుడు మంగ, టీపీసీసీ కార్యదర్శి శివకుమార్, బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ మల్లేష్, జిల్లా గొర్లకాపరుల సంఘం అధ్యక్షుడు జంగయ్య, మాజీ సర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ శ్రీశైలం, నాయకులు బాషయ్య, శంకర్, ఐలయ్య, కురుమ కులస్తులు పాల్గొన్నారు.

**ఆరుట్లలో గ్రామంలో..**

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆరుట్ల చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, రమేష్, ఉప సర్పంచ్ జంగయ్య గౌడ్, నాయకులు జంగయ్య, రఘుపతి, రాములు, బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



మంచాల: కొమురయ్య జయంతి వేడుకలో నాయకులు

### పద్మావతికి మంత్రి సన్మానం



డాక్టర్ పద్మావతిని సన్మానిస్తున్న మంత్రి సబితారెడ్డి

హయత్‌నగర్: మూడు సార్లు రాష్ట్రపతి అవార్డు పొందిన మునుగనూరుకు చెందిన డాక్టర్ పద్మావతిని సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సన్మానించారు. కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు ఆధ్వర్యంలో సోమవారం పద్మావతి మంత్రిని తన నివాసంలో కలిశారు. సబితారెడ్డి మాట్లాడుతూ... సామాన్య వ్యక్తులు సాధించలేనిది.. దివ్యాంగురాలైనా పద్మావతి మూడుసార్లు రాష్ట్రపతి అవార్డు పొందడం అభినందనీయమని.. ఆమె జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పద్మావతికి తగిన గుర్తింపు దక్కేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

### బీజేపీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

ఇబ్రహీంపట్నం: బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అంజయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల బీజేపీ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని అధికారంలోకి తీసుకురావాలంటే ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి, సహ ఇన్‌చార్జిలు పార్టీ విస్తరించేందుకు క్షేత్ర స్థాయిలో పటిష్టంగా ఉండేందుకు పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు దండ శ్రీశైలం, నాయకులు.. మొగలి గణేశ్, దొండ విష్ణువర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, రమేష్‌చారి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మజీద్‌పూర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి జలసమృద్ధి విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డితో పాటు ఉపసర్పంచ్ గడ్డం బాలకిషన్, పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి అవార్డు రావడం పట్ల తమపై మరింత బాధ్యత పెరిగిందని.. ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామస్తుల సహకారంతోనే మజీద్‌పూర్‌కు గుర్తింపు లభించిందన్నారు. దీంతో సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి, బాటసింగారం సహకారం సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, ఎంపీడీఓ మమత, ఎంపీఓ వినోదను పాలకవర్గ సభ్యులతో కలిసి సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

హయత్‌నగర్: మున్సిపాలిటీలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 3వ వార్డులో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపాలిటీలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కౌన్సిలర్ మద్ది శ్రీధర్‌రెడ్డి, నాయకులు జోర్క శ్రీరాములు, చెవుల చిరంజీవి పాల్గొన్నారు.

**అభివృద్ధిలో ముందజ..**

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుందని.. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి అన్నారు. సోమవారం 20వ వార్డులో స్థానిక కౌన్సిలర్ జోర్క గీతాశ్రీరాములుతో కలిసి రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కుంట్లూరు అభివృద్ధి కోసం అధిక నిధులు తీసుకొచ్చామని.. కాలనీలు విస్తరిస్తున్నందున అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హజ్రత్‌బేగం, జోర్క లక్ష్మణ్, రవి, సాదు మురళి, జోర్క వీరయ్య వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కావలి రమేష్‌కు అంబేడ్కర్ అవార్డు



రాములుకు అవార్డు అందజేస్తున్న రాధాకృష్ణ

కద్దాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన కావలి రాములు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు–2023ను అందుకున్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జాతీయ బహుజన సాహిత్య అకాడమీ కమిటీ కాన్ఫరెన్స్ మీటింగ్‌లో బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం ప్రతి సంవత్సరం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రజా ఉద్యమ కారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయడం జరుగుతుందని రాధాకృష్ణ తెలిపారు. కావలి రాములు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు అందుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాదేవి రమేశ్ ఉన్నారు.

# ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై బీజేవైఎం నేతల ఫైర్
- మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మదహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

తలకొండపల్లి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అందుకు సంబంధిత రాష్ట్ర మంత్రులు తమ పదవులకు తక్షణమే రాజీనామాలు చేయాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం అనిల్ ఆధ్వర్యంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పేపర్ లీకేజీకి నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేటీఆర్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, సీనియర్ నాయకులు శాంత కుమారి, నాగరాజు, బాలకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.